''అయ్యా! పది రూపాలియ్యయ్యా! దీపావళి సామాన్లు కొనుక్కుంటాను''

బతిమాలుతూ అడుగుతున్నాడు రిక్షా అప్పన్న ఎనిమిదేళ్ళ కొడుకు రామిగాడు. వాళ్ళపాక ప్రక్కన వున్న రెండు పెద్ద డాబా యింటివాళ్ళు చాలా మందు సామాను బయట మంచాల మీద వేసి ఎండబెట్టుకోవడం గమనించి చూద్దామని వెళితే పొమ్మని కసిరే సారు రామిగాడ్ని. వాళ్ళంతా అన్నన్ని సామానులు కొనుక్కుని మురిసిపోతూంటే, రామిగాడి అయ్య ఒక్క పది రూపాయల సామాను కూడా కొనలేదు. ఆ సామాన్లన్నీ వాళ్ళ పలుకుబడితో బయట దండుకుని ఆనందిస్తున్నారన్న విషయం పాపం రామిగాడి చిన్న బుర్రకేం తెలుసు!

తాగిన మైకంలో వున్న అప్పన్న ''పోరా! ఇప్పుడు డబ్బులు లేవు'' అని కసిరి గెంటేసాడు. అందరి లాగ వాడికి కూడా అమ్మ వుంటే, అదే ఎక్కడో ఓ దగ్గర నాలుగు సామాన్లు అడిగి తెచ్చయినా సరే రామిగాడి కిచ్చేది. కాని రైల్వే బ్రిడ్జి కట్టడానికి కూలి పనికెళ్ళిన వాడి అమ్మ, బ్రిడ్జి మీద నుండి పడి చచ్చిపోయింది. అప్పటి నుండి రిక్షా సంపాదనతో వాడి బాబు కాసిన గెంజిమెతుకులు తిని రోజులు గడిపేస్తున్నాడు రామిగాడు. బళ్ళో కెళ్తాను, పుస్తకాలు కావాలి, బట్టలు కావాలి'' అని వాడి బాబుని ఎప్పుడూ వేధించలేదు. నలుగురు పిల్లలూ వీడ్ని దొంగగా చూసి దూరంగా పొమ్మన్నందుకే వాడికి బాధ. పౌరుషం వచ్చి మందు సామాన్లకి డబ్బులడిగాడు. అరిచి గీపెట్టినా అర్ధ రూపాయి ఇవ్వ నన్నాడు అప్పన్న. అలాంటిది పది రూపాయ లెక్కడిస్తాడు?

అంతే! వాడి మనసులో ఏదో ఆలోచన తళుక్కున మెరిసింది. నాలుగిళ్ళవతల హైస్కూల్ టీచరు సరస్వతి గారున్నారు. ఆవిడ పిల్లలిద్దర్ని రోజూ అప్పన్న స్కూల్‌కి తీసుకెళ్తుంటాడు నెల జీతం మీద. రామిగాణ్ణి చదివించమని ఒకటి, రెండు సార్లు ఆవిడ అప్పన్నని అడిగినా, 'ఆడి కెందుకమ్మా చదువని' అప్పన్న వినిపించుకోలేదు. డబ్బులు అవసరం వచ్చినప్పుడు మాత్రం రామిగాణ్ణి పంపి అవసరానికి నాలుగు, ఐదు ఆవిడ దగ్గర్నుండి అడిగి తెప్పించుకుంటాడు. ఆ డబ్బులు తరువాత తనకొచ్చే జీతంలో మినహాయించుకోవడం మామూలైంది. ''అమ్మగారు! మా అయ్య పది రూపాయిలుంటే ఇమ్మన్నాడండి, రేపు దీపావళి కదా, ఇంట్లోకి పప్పు, ఉప్పు కొంటాడంట'' అర్థిస్తూ చిన్న అబద్ధం ఆడాడు రామిగాడు.

ఏ కళనుందో మారు మాట్లాడకుండా ఇంట్లో కెళ్ళి పది రూపాయిలు తెచ్చి రామిగాడికిచ్చింది టీచరమ్మ సరస్వతి.

అక్కడ నుండి పరుగు పరుగుతో దీపావళి సామాన్లకు కొట్ల వైపుకి వెళ్ళాడు రామిగాడు. అటూ ఇటూ చూసాడు, వాడి బాబు ఎక్కడైనా కనిపిస్తాడేమోనని, లేడని నిర్ధరించుకుని, ఓ కొట్టు దగ్గరికెళ్ళి ఆశగా చూస్తున్నాడు మందు సామాన్లవైపు అగ్గిపెట్టెలు, కాకరపువ్వొత్తులు, సీమటపాకాయలు, అయితే తనకు సరిపోతాయనుకున్నాడు. అమ్మో వాళ్ళంతా చాలా హడావుడిగా వుండడంతో ఏం చేయాలో తెలియని రామిగాడు ఓ షాపు ముందుకెళ్ళి నుంచున్నాడు భయం భయంగా చూస్తూ.

''ఏరా! ఏం కావాలి? వురిమినట్టుగా చూసాడు రామిగాడి వాలకం చూసిన షాపువాడు ఏదో



పి.మురళి

అనుమానపడుతూ.

''ఇవి కావాలి,'' అంటూ అగ్గిపెట్టెలు వాటి వంక చూస్తూ చెప్పాడు రామిగాడు.

వాడిచేతిలో డబ్బులు తీసుకుని 'తొందరగా చూడు ఏం కావాలో?' మర్యాద లేకుండా కసిరాడు షాపువాడు.

ఎర్ర రంగు, పచ్చ రంగు అగ్గిపెట్టెలు ప్రక్కడు తీసి పెడుతుండగా, పెద్ద పెద్ద కేకలుతో చాల మంది జనం హడావిడిగా అటూ ఇటూ పరిగెట్టడం కనిపించింది. మందు సామాన్లు కొంటు కొంటున్న వారు ఏం అర్థం కాని పరిస్థితిలో చెల్లా చెదురై పోయారు. ఓ ఆవుని తరుముకొస్తున్న పెద్దఆంబోతుకి భయపడి జనం చెల్లాచెదురైనట్టు అక్కడున్న వాళ్ళకి తరువాత తెలిసింది. ఈ హడావుడిలో రామిగాడు జనం తోపిడికి షాపుకి దూరంగా వెళ్ళిపోయాడు.

జనం సర్దుకునేటప్పటికి ఐదు నిమిషాలు పట్టింది. తొక్కిసలాటలో చెల్లాచెదురైన మందు సామాన్లు సర్దటానికి కొట్లోకుర్రాళ్ళు అవస్థ పడుతున్నారు.

''నాకు అగ్గిపెట్టెలు అవీ ఇవ్వలే''దంటూ షాపు దగ్గరికొచ్చిన రామిగాడ్ని చూసిన షాపువాడు, సామాన్లునేలపాలయ్యాయన్న కోపంతో, దూరంగా పొమ్మని కసురుకున్నాడు రామిగాన్ని. తను డబ్బులిచ్చిన సంగతి చెపుతున్నా అక్కడ వినిపించుకునే వాళ్ళు ఎవరూ లేరు. వాడికళ్ళలో నీళ్ళు తిరిగాయి. జనం రద్దీ ఎక్కువైంది. ఎవరి హడావుడిలో వాళ్ళున్నారు.

రామిగాడి డబ్బులిచ్చిన సంగతి షాపు వాడికి జ్ఞాపకం వున్నా, వాడు ఎందుకో పట్టించుకోవడం లేదు. ఆ సంగతికి ఎవరికి చెప్పినా ఎలాంటి ప్రయోజనం వుండదు. ఎవరి హడావుడిలో వాళ్ళున్నారు.

వాడి అయ్యకు ఈ విషయం చెపితే మరో నాలుగు తంతాడు. రామిగాడి వళ్ళు కుతకుత ఉడుకిపోతుంది. కడుపు నిండా తిండిలేకపోయినా ఎంతో ఆశగా దీపావళి రోజు మందు సామాన్లు కాల్చుకోవచ్చు అనుకున్న వాడి ఆశలేదని అడియాశ అయ్యింది. వాడి చిన్న శరీరంలో ఏదో శక్తి ప్రవేశించింది. ఏదో ఆలోచన వచ్చిన వాడిలా ఒక్క వురుగుతో అక్కడి నుండి బయట పడ్డాడు.

మరి కాసేపట్లో 'మంటలు, మంటలు' పెద్ద పెద్ద కేకలతో జనం కళావికలువై దిక్కు కొకరు చొప్పున పరిగెడుతున్నారు. మంటలు చాలా వృధృతమౌతున్నాయి. ఆ వాతావరణం శ్మశానంగా మారింది కొద్దిసేపట్లోనే గణగణమంటూ వచ్చిన ఫైర్ ఇంజన్‌లు అలా నిలబడి చూస్తున్నాయి. కాని బూడిద అయిన ఆ వాతావరణాన్ని. కొన్ని వేల ఖరీదు చేసే, ఓ పని షాపులు చూస్తుండగా భస్మీపటలం అయ్యాయి. కన్నుల పండువుగా దీపావళి పండుగ తిలకించాడు. రామిగాడు జనం మధ్యలోంచి, వాడి కళ్ళల్లో ఏదో వెర్రి ఆనందం తొంగి చూసింది.